హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	196	223
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 | కనిష్ఠం 23.4

అంతా మాయ!



- సిండికేట్‌గా మారుతున్న మిల్లర్లు
- ధర తగ్గించి రైతులను దగా చేస్తున్న వైనం
- కరువు పీడిస్తున్నా.. పంట సాగు చేసిన కర్షకులు
- ఏటా పెరుగుతున్న ఉత్పాదక వ్యయాలు
- సాగుభారం.. అప్పుల తిప్పలు
- దిక్కుతోచని స్థితిలో పంటను దహనం చేస్తున్న రైతులు

రైతు ఎంత కష్ట పడుతున్నా ఆశించిన ప్రతిఫలం దక్కడంలేదు. దీంతో ఆరుగాలం శ్రమ ఆవిరైపోతోంది. దేశానికి వెన్నుముక అయిన కర్షకుని వెన్నుముకే విరుగుతోంది. ఏటా పెరుగుతున్న ఉత్పాదక వ్యయాలు, రాబడులకు పొంతన కుదరక అప్పుల కుప్పలే మిగులుతున్నాయి. వ్యవసాయ సాగుబాటలో ఎదురవుతున్న కష్టనష్టాలకు ఎదురొడ్డి ఆశల సాగుబడిలోనే ఉండేందుకు ఇష్టపడుతున్న రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి.

– మిర్యాలగూడ



యాద్గార్‌పల్లిలో పంటను దహనం చేస్తున్న రైతు బంటు లక్ష్మయ్య

వ్యవసాయ పెట్టుబడులు పెరిగినంతగా గిట్టుబాటుధర లభించకపోవడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు నిర్ణయించిన ధరకు ధాన్యాన్ని వారికి అప్పగించి నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఫలితంగా రైతు కుటుంబాలు అప్పుల ఊబిలోంచి బయటపడలేకపోతున్నాయి. ఏటా వ్యవసాయ ఉత్పాదక వ్యయాల్లో మార్పులు జరుగుతున్నాయి. పెరుగుతున్న పెట్టుబడుల స్థాయిలో గిట్టుబాటు ధర లేక రైతు కుటుంబాల్లో ఆనందం సన్నగిల్లుతోంది. గత పదేళ్ల కాలంలో పెట్టుబడి వ్యయం రెండింతలు పెరిగింది. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు ట్రాక్టర్ కిరాయిలూ పెరిగాయి. నాట్లు వేసే సమయంలో కూలీలు దొరక్క ఒక్కొక్కరికి రోజుకు రూ.వెయ్యితో పాటు ఆటో చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, వరికోత యంత్రాల రేట్లు పెరిగి రైతుకు భారంగా పరిణమించాయి. 2016లో ఎకరాకు పెట్టుబడి వ్యయం గరిష్ఠంగా రూ.18,500 కాగా 2023 నాటికి రూ.26,000 నుంచి రూ.30,000కు చేరింది. పంట కాలమంతా రైతు కుటుంబం రెక్కలు ముక్కలు చేసుకుంటే మిగిలేది ఎకరానికి రూ.10వేలకు మించి ఉండటంలేదు. ప్రకృతి కరుణించి పంట చేతికి వస్తేనే రైతులు ఈ కొద్దిపాటి ఆదాయమైన పొందగలిగేది.

రైతును కుంగదీసిన వాతావరణ మార్పులు

యాసంగిలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఫిబ్రవరి వరకు మంచు ప్రభావం ఉండడంతో వరిని తెగుళ్లు ఆశించాయి. పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది.అందుకు వేలాది రూపాయల పెట్టుబడి భారంగా మారింది. డిసెంబరు మొదటి వారంలో వరినాట్లు పూర్తి చేసిన రైతుల వరిపైరు పిలకలువేసి దుబ్బు కట్టకుండానే నాటిన తల్లి కర్రలు ఈత పట్టి రైతులు ఆందోళన చెందారు. ప్రతికూల పరిస్థితుల నడుమ రైతులు కష్టాలకోర్చి వరిపండిస్తే మార్కెట్ మాయాజాలంలో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

గతంలో అధికారుల పరిశీలనలో..

గతంలో పోలీస్, రెవెన్యూ, మార్కెటింగ్, సివిల్‌సప్లయ్, వ్యవసాయశాఖల అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూశారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో రైతులకు భరోసా కరువై వ్యాపారులు సూచించిందే రేటుగా భావించి సన్నధాన్యాన్ని విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో సన్నబియ్యం ధరలు నానాటికి పెరుగుతున్న తరుణంలో సన్నధాన్యం పండించిన రైతుకు మాత్రం లాభం చేకూరడంలేదు. బియ్యం ధరలకనుగుణంగా సన్నధాన్యానికి ధర లభించకపోవడంతో రైతులకు నష్టం జరుగుతుండగా, వ్యాపారులకు మాత్రం లాభాలు వచ్చిపడుతున్నాయి.

దీంతో నిత్యావసరాలు, పిల్లల చదువులు, తిండిగింజలకు ఈ ఆదాయం సరిపడక అప్పుల కుప్పలపైనే జీవితాన్ని వెళ్లదీయాల్సిన దుస్థితి. పంటకాలమంతా కష్టపడినా అన్నదాతకు దినసరి కూలీ రేటైనా దక్కని దుస్థితి.

కరువు ఛాయలు కమ్ముకోవడంతో..

ఈ ఏడాది వరుణుడు కరుణించక జిల్లాలో కరువు ఛాయలు కమ్ముకోవడంతో పచ్చని పొలాలు ఎండిపోయాయి. నాగార్జునసాగర్, డిండి జలాశయాల్లోకి చుక్కనీరు చేరకపోవడంతో వానాకాలం సాగువిస్తీర్ణం 40 శాతానికి పడిపోగా యాసంగి బోరు బావుల సేద్యం 30శాతానికి తగ్గిపోయింది. యాసంగిలో ఆయకట్టు పరిధిలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో అధికారులు క్రాప్‌హాలీడే ప్రకటించగా చెరువులు, బోరు బావులపై ఆధారపడి రైతులు వరిసాగు చేశారు. రైతులు ఊహించిన దానికంటే వేగంగా భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి నాట్లు వేసిన రెండునెలలకే 60శాతం బోర్లు పని చేయకుండా పోయాయి. పెట్టుబడి వ్యయమంతా ఖర్చుచేసినా వరి ఈత దశలో నీరు అందకపోవడంతో కొత్తగాబోర్లు వేసేందుకు రైతులు పోటీపడ్డారు. ఒక్కో రైతు రూ.లక్షలు వెచ్చించి రెండు నుంచి ఆరేడు బోర్లు వేసినా ఫలితంలేకపోవడంతో రైతు ఆవేదన చెందుతున్నాడు. రేయనక, పగలనక ట్యాంకర్ల ద్వారా మడులు తడిపారు. కొన్ని గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంట చేలు ఎండిపోయాయి. జిల్లాలో సుమారు 20వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఎండుతున్న పంటను చూసి గుండె చెదిరిన మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి రైతులు కొందరు చేలకు నిప్పు పెట్టారు.

సన్నాలకు దక్కని గిట్టుబాటు ధర

ఈ నెల మొదటివారంలో క్వింటా ధాన్యానికి రూ.2700వరకు చెల్లించి కొనుగోలు చేసిన మిల్లర్లు వారం రోజుల తర్వాత ధరలో కోతపెట్టారు. ప్రస్తుతం క్వింటాకు రూ.2,250 నుంచి రూ.2,300కు తగ్గించారు. దీంతో రైతులు రోడ్లపై వచ్చి నిరసనకు దిగుతున్నారు. అయినప్పటికీ అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో స్పందించడంలేదు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధాన్యం కొనుగోళ్ల విషయంలో కొర్రీలు పెడుతున్నారు. పచ్చగింజ, తాలు సాకుతో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించక ఎకరాకు రూ.25వేల వరకు రాబడిని నష్టపోవాల్సి వస్తోంది. వాస్తవానికి ఎకరాకు గతంలో 30 క్వింటాళ్ల వరకు ధాన్యం దిగుబడి వచ్చేది. అయితే క్వింటాకు రూ.2500 చొప్పున ఎకరాకు రూ.75వేల ఆదాయం వచ్చేది. అయితే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరి ధాన్యం రాగా, మిల్లర్లు ధాన్యం మద్దతు ధర తగ్గించడంతోపాటు కరువు పరిస్థితుల్లో పంట దిగుబడి తగ్గి ఎకరాకు సుమారు రూ.25వేల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

ఐదెకరాలు ఎండిపోయింది



నాలుగు బోర్ల నీటిసాయంతో 12 ఎకరాల్లో యాసంగి వరిసాగు చేశాను. వరి పైరు ఈతదశలో భూగర్భజలాలు పడిపోయి రెండు బోరుబావులు అడుగంటాయి. ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు లూజ్‌పైపులు తెచ్చి మడులవారీగా వరుస తడులు కట్టినా ఫలితం లేకుండా పోయింది.ఎండల తీవ్రత పెరగడంతో ఐదెకరాల వరిపైరు నిలువునా ఎండిపోయింది. సుమారు రూ.2.50లక్షల నష్టం జరిగింది.

– పాండు, రైతు, నీలాయిగూడెం, త్రిపురారం మండలం

ధర తగ్గించి కొంటున్నారు



సన్నధాన్యం దిగుబడులను అమ్ముకునేందుకు మిల్లర్లను ఆశ్రయిస్తున్నాం. మిల్లు పాయింట్ల వద్దకు స్వల్పంగా ధాన్యం వచ్చిన రోజుల్లో క్వింటాకు రూ.2700ధర చెల్లించారు. పంటనూర్పిడి పనులు ఊపందుకొని ధాన్యం రాక పెరగడాన్ని గమనించిన వ్యాపారులు ధరలో భారీగా కోతపెడుతున్నారు. మిల్లర్లంతా ఏకమై క్వింటాకు రూ.2300 కంటే తక్కువ ధర చెల్లిస్తున్నారు.

– మోదుగు ప్రభాకర్‌రెడ్డి, రైతు, బుగ్గబావిగూడెం

రైతులను ఇబ్బందులు పెడితే ఊరుకోను : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్: రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా రైతులు తెచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా రైస్ మిల్లులను ఆయన సందర్శించి మిల్లర్లతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందుకు గురిచేస్తే సహించేది లేదన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకొని గిట్టుబాటు ధర అందించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా కొందరు మిల్లర్ల తీరు మారలేదని,మొండి వైఖరి అవలంబిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మిల్లులవద్ద ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు.



మిల్లుల వద్ద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సీజ్ చేసిన నగదును గ్రీవెన్స్ కమిటీ ద్వారా పొందాలి



గ్రీవెన్స్ కమిటీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరావు

సూర్యాపేట అర్బన్, మార్చి 22 : ఎన్నికల నేపథ్యంలో సీజ్ చేసిన నగదును జిల్లా గ్రీవెన్స్ కమిటీ ద్వారా పొందాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ కమిటీ కార్యాలయం ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రూ.50వేల లోపు నగదును తీసుకెళ్లడానికే అనుమతి ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లవద్దని సూచించారు.రూ. 10లక్షలకు మించి నగదు పట్టుబడితే ఆదాయపు పన్ను అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసరంగా తీసుకెళ్లే నగదుకు సంబంధించిన అకౌంట్ పుస్తకం, ఏటీఎం చీటీ, కొన్న వస్తువులు, ధాన్యం విక్రయ నగదు అయితే సంబంధిత బిల్లు, భూమి విక్రయించిన సొమ్ము డాక్యుమెంట్లు, వ్యాపార సేవల నగదు అయితే లావాదేవీల వివరాలు చూపించాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం గ్రీవెన్స్ కమిటీ ఇన్‌చార్జి, జడ్పీ సీఈవో వీవీ అప్పారావు సెల్ నెంబర్ 8374566222కి సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష, ఏవో సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం, వస్తువులు ట్రెజరీ స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తామన్నారు. ఇప్పటివరకు రూ.27.08లక్షల నగదు, 1,156 లీటర్ల మద్యం, రూ.15.48 లక్షల విలువైన 229 గ్రాముల బంగారం, రూ.24.67 లక్షల రెడీమెడ్ వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రతీ నీటి బొట్టును కాపాడుకోవాలి

ప్రతీ నీటి బొట్టును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాగణంలో ప్రపంచ జల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భజలాలు నిల్వలు పెరిగేలా అభివృద్ధి చేసుకోవాలన్నారు. భావితరాలకు ప్రకృతి వనరులైన గాలి, నీరు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటి వృథాను తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఏవో సుదర్శన్‌రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, శ్రీనివాసరాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పటిష్ఠంగా అమలుచేయడమే లక్ష్యం



బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ

కోదాడ రూరల్, మార్చి 22 : ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలుపర్చడమే లక్ష్యమని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సందర్భంగా శుక్రవారం ఎన్టీఆర్ రూరల్ జిల్లా డీసీపీ శ్రీనివాసరావుతో కలిసి మండల పరిధిలోని తెలంగాణ-ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద, గరికపాడు వద్ద పోలీస్ చెక్‌పోస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టుల నిర్వహణ, వాహనాల తనిఖీలు, అక్రమ రవాణాపై ఇరురాష్ట్రాల సరిహద్దుల్లో సమాచారాన్ని చేరవేసుకోవడం వంటి అంశాలపై సరిహద్దు జిల్లాల ఎస్పీలు సమీక్షించి పలు సూచనలు చేశారు. నగదు, మద్యం తరలింపు, అసాంఘిక కార్యకలాపాల నిర్వహణ మొదలగు వాటిపై ఇరురాష్ట్రాల సరిహద్దు అధికారులు నిఘా ఉంచి, అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. అనంతరం ఇరురాష్ట్రాల చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సామాన్య ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వచ్చిపోయే అన్ని గ్రామీణ రహదారులపై నిఘా ఉంచాలన్నారు. రూ.50 వేల కన్నా ఎక్కువ నగదును తీసుకెళ్తే సంబంధిత డాక్యుమెంట్లను చూపించాలని, ఎక్కువ మొత్తంలో ఆభరణాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ పరికరాలను రవాణా చేస్తున్నా ఆధారాలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, నందిగామ ఏసీపీ రవికిరణ్, కోదాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి, జగ్గయ్యపేట ఇన్‌స్పెక్టర్ జానకిరాములు, ఇరు రాష్ట్రాల సరిహద్దు మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం బహుదూరం



ఆయిల్‌పాం తోట

వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన ఆయిల్‌పాం సాగు లక్ష్యానికి చేరుకోలేకపోతోంది. గత కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆయిల్‌పాం సాగుపై సమీక్ష చేసిన సందర్భంగా లక్ష్యానికి అనుగుణంగా సాగు కావడంలేదని, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కూడా నెలకొంది. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం అయితే సంవత్సరాల తరబడి రైతులకు ఆర్థికంగా కలిసి వస్తుంది. అయితే ఒక్కోసారి మార్కెట్ సమస్యలు తలెత్తితే రైతులు నష్ట పోయే పరిస్థితులు కూడా ఉంటాయి.

– నల్లగొండ

- ఆయిల్‌పాం సాగుకు నీటి కొరత
- సమృద్ధిగా ఉంటేనే ముందుకు సాగే పరిస్థితి
- పంట సాగు విస్తీర్ణానికి ముగిసిన కటాఫ్ తేదీ
- ప్రస్తుతానికి మొక్కల పంపిణీ నిలిపివేతకు నిర్ణయం..?
- తోటలను పరిశీలించడంలో కంపెనీ ప్రతినిధుల నిర్లక్ష్యం
- పలుచోట్ల రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కరువు

ప్రస్తుతం రైతులు ఆయిల్‌పాం సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నప్పటికీ అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈసమస్యలను అధిగమిస్తేనే ప్రభుత్వం ఆశించిన విధంగా లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలుంటాయి. కానీ అనేక ఆటంకాలతో రైతులు ఆశించిన మేరకు మొక్కలు సరఫరా అయ్యే పరిస్థితి గానీ, తోటల విస్తీర్ణం పెరిగే అవకాశాలు గానీ సన్నగిల్లుతుండటంతో రాబోయే రోజుల్లో ఆయిల్‌పామ్ సాగుపై నీలినీడలు కమ్ముకునే పరిస్థితి కనిపిస్తుంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఆయిల్‌పాం సాగు విస్తరిస్తేనే రైతులకు మేలు చేకూరే అవకాశాలుంటాయి. ఆ వైపుగా అధికారులు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణలో కంపెనీల వైఫల్యం

వాస్తవానికి హార్టికల్చర్ అధికారులతోపాటు ఆయా కంపెనీలు కూడా తమ ప్రతినిధులు ద్వారా ఆయిల్‌పాం సాగు తోటలను పరిశీలించాల్సి ఉంటుంది. ప్రైవేట్ కంపెనీలు ఏరియాకు ఒక టెక్నికల్ ఉద్యోగితోపాటు మండలాలవారీగా ప్రతినిధులను ఏర్పాటుచేసి రైతులకు అందుబాటులో ఉంచాలి. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో పతాంజలి కంపెనీ మొక్కలను పంపిణీ చేస్తుండగా, యాదాద్రి భువనగిరి జిల్లాలో టీఎస్ ఆయిల్ ఫెడరేషన్ మొక్కల పంపిణీ బాధ్యతలు తీసుకుంది. అయితే కంపెనీలు రైతులకు అందుబాటులో ఉండాల్సి ఉండగా అసలు రైతులకు అందుబాటులో ఉండటం లేదని తెలుస్తుంది. మొక్కల పంపిణీ మొదలుకుని చెట్లు పెద్దగా అయిన తర్వాత తెగుళ్ల రాకుండా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించాల్సిన బాధ్యత కంపెనీలదే. అయితే ఆ పరిస్థితి ఎక్కడ కానరావడం లేదు. ఎకరానికి 57 మొక్కల వరకు నాటుతారు. ఒక్కో మొక్కకు ప్రభుత్వమే రూ.173 సబ్సిడీ ఇవ్వగా, రూ.20 మాత్రం రైతు వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. డ్రిప్ సౌకర్యానికి కూడా ప్రభుత్వమే భారీగా సబ్సిడీ ఇస్తుంది. అదేవిధంగా నాలుగేళ్ల వరకు ప్రభుత్వమే ఎకరాకు రూ.4200వరకు మందులకు ఇతర అవసరాలకు చెల్లిస్తుంది. అదేవిధంగా ఆయిల్‌పామ్ సాగులో ఈ డబ్బుల ద్వారా అంతర పంటలు కూడా వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉద్యానశాఖతోపాటు ప్రైవేట్ కంపెనీలది.

ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ఆయిల్‌పాం సాగుకు నీటిగండం ఏర్పడింది. భూగర్భజలాలు తగ్గడంతో ఆయిల్‌పాం సాగు ముందుకు సాగడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఈ నెల 10వ తేదీ వరకు కటాఫ్ డేట్ విధించింది. నీటి వనరులు గణనీయంగా తగ్గినందున వర్షాలు పడి సమృద్ధిగా భూగర్భజలాలు పెరిగిన తర్వాతే తిరిగి ఆయిల్‌పాం సాగుకు సంబంధించి చర్యలు తీసుకోనున్నారు. ప్రస్తుతానికి అయితే మొక్కల పంపిణీ నిలిపివేసినట్లు సమాచారం.

లక్ష్యంలో 50శాతం దాటని సాగు విస్తీర్ణం

వాస్తవానికైతే రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సుమారు 35వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగును పూర్తిచేయాలని నిర్దేశించింది. అయితే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ముందుగానే పంటల సాగు మొదలు కాగా యాదాద్రి భువనగిరి జిల్లాలో గత ఏడాది నుంచే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం మొదలైంది. మొత్తంగా మూడు జిల్లాల్లో 14,995 ఎకరాల్లో మాత్రమే ప్రస్తుతం ఆయిల్‌పామ్ సాగులో ఉంది. నల్లగొండ జిల్లాలో 8,945 ఎకరాల్లో సూర్యాపేట జిల్లాలో 3,965 ఎకరాల్లో, యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,085 ఎకరాల్లో పంటను సాగు చేశారు. నల్లగొండ జిల్లాలోని కాస్త అధికంగా ఉండగా మిగతా జిల్లాలో పంట విస్తీర్ణం ముందుకు సాగక పోవడం గమనార్హం. అయితే నల్లగొండ జిల్లాలో సైతం లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు ముందుకు సాగాల్సి ఉంది. ఈపాటికే దాదాపు నల్లగొండ జిల్లాలో 15వేల ఎకరాల్లో విస్తీర్ణం కావాల్సి ఉండగా అందుకనుగుణంగా అడుగులు పడటంలేదు. 2008లో పైలట్ ప్రాజెక్టుగా అనుముల, వేములపల్లి, నిడమనూరు, కోదాడ, హుజూర్‌నగర్ మండలాల్లో ఆయిల్‌పామ్ సాగును చేపట్టారు. రైతులు ఆసక్తి కనబర్చడంతో విస్తరించాలని అధికారులు ఆ దిశగా ప్రణాళిక రూపొందించారు.



నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం



ఆయిల్‌పాం సాగు తోటలను ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు నిత్యం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా పర్యవేక్షణ చేయడం లేదంటే రైతులు మా దృష్టికి తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం లక్ష్యానికనుగుణంగా అధికారులు పనిచేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో నీటి సమస్యలు ఏర్పడ్డాయి. ఆయిల్‌పామ్‌కు నీటి వనరులు ఉంటేనే ఉపయోగం. లేకుంటే ఆయిల్‌పాం సాగుకు ఇబ్బంది వస్తుంది. తిరిగి వర్షాలు మొదలయ్యాక ఆయిల్‌పామ్ తోటలను విస్తరిస్తాం.

– సంగీత లక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, నల్లగొండ

సేంద్రీయ సాగుతో చీడపీడల నివారణ



తెగుళ్ల నివారణపై శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డీ ఆదర్శ్

గరిడేపల్లి, మార్చి 22 : సేంద్రీయ సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డీ ఆదర్శ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో గ్రామీణ యువతకు వారం రోజు శిక్షణలో భాగంగా మూడో రోజు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులతో పంటలపై తెగుళ్ల ఉధృతి పెరిగిందన్నారు. కేవలం హానికరమైన రసాయన పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల వాటిని అరికట్టలేమని, సమగ్ర సస్యరక్షణ చర్యలతోనే సమర్థవంతంగా అధిగమించవచ్చన్నారు. పంట తొలిదశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



దుశర్ల సత్యనారాయణను సన్మానిస్తున్న వాణిప్రసాద్

మోతె, మార్చి 22 : నీటి సంరక్షణ అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలు ఇబ్బందులు పడకుండా బాధ్యతగా నీటి వృథాను అరికట్టాలని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఇరిగేషన్ కార్యాలయంలో అడవుల పెంపకం, నీటినిల్వలు చేపట్టే వారితో నీటి పొదుపుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతె మండలంలో 70 ఎకరాల్లో అడవిని తయారు చేయడంతో పాటు అందులో నీటి నిల్వల కోసం కుంటలు, ఇంకుడు గుంతలు, చెరువులను ఏర్పాటు చేసిన దుశర్ల సత్యనారాయణను ఆమె సన్మానించారు. మానవ మనుగడ ముందుకు వెళ్లాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాలని, అందుకోసం నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నార్కట్‌పల్లి, మార్చి 22: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. మండలంలోని అవురవాణి గ్రామానికి చెందిన ముప్పిడి పిచ్చమ్మ శుక్రవారం ఉదయం నుంచి కన్పించటంలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తమ్ముడు పందుల యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

కోదాడ రూరల్, మార్చి 22 : సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దోరకుంట గ్రామంలో పశువులు మేపుకుంటున్న మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ జరిగినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవించే శిరంశెట్టి సరస్వతి శుక్రవారం పశువులను మేతకు తీసుకెళ్లింది. దోరకుంట గ్రామశివారులో సాయంత్రం 5 గంటల సమయంలో బైక్‌పై వచ్చిన ఇరువురు వ్యక్తులు ఆమె మెడలోని పుస్తెలతాడును తెంపుకుని పరారయ్యారు. నాలుగు తులాలకు పైగా ఉంటుందని, రూ.2 లక్షలు విలువైందని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉమ్మడి నల్లగొండలో
రూ.10.51లక్షల నగదు స్వాధీనం

అడవిదేవులపల్లి / త్రిపురారం / మద్దిరాల / ఆత్మకూర్(ఎస్) / కోదాడ రూరల్, మార్చి 22: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.10,51,600 నగదును పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెంటచింతల మండలం మల్లారం గ్రామానికి చెందిన నగినాల నరేష్ తన ద్విచక్ర వాహనంలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలెంపల్లికి రూ.2,69,500 నగదుతో వస్తుండగా సత్రశాల చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలో భాగంగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వర్రె కొమరయ్య ద్విచక్ర వాహనంపై రూ.1,36,400 నగదు తీసుకువెళుతుండగా త్రిపురారం శివారులో ఎస్ఐ వీరశేఖర్ స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి చెక్‌పోస్ట్ వద్ద నలుగురి నుంచి రూ.3,34,700 ఎస్ఐ మధునాయుడు స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ వద్ద ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1.61 లక్షలు, సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో రూ.1.50లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

● కొండేటి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి రాజనర్సింహ



కొండేటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహ, పక్కన జానారెడ్డి, కొండేటి మల్లయ్య

నల్లగొండ, మార్చి 22: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు ముందుకు రావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడలో నూతనంగా ఏర్పాటుచేసిన కొండేటి ఆస్పత్రిని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు వ్యాపార దృక్పథంతో పాటు సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలన్నారు. కొండేటి ఆస్పత్రి మంచి వైద్యసేవలు అందించి ప్రతీ ఒక్కరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ సునితారెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, బాలునాయక్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, కే.లక్ష్మారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి కొండేటి మల్లయ్య, డాక్టర్ ప్రమోద్‌కుమార్, డాక్టర్ కే.సౌమ్య, డాక్టర్ కొండేటి దీప్తి పాల్గొన్నారు.

వ్యాధి దొరక్క.. చికిత్సకు లొంగక

● రెండు నెలలుగా మంచంపట్టిన ఇందుగుల ● ● మాయదారి జబ్బుతో ఆర్థికంగా చితికిపోతున్న గ్రామస్థులు

● బడుగు జీవుల బాధలు వర్ణనాతీతం ● రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు

రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవులకు మాయదారి రోగం రావడంతో ప్రజలు ఒళ్లు నొప్పులు, జ్వరంతో బాధపడుతున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. రెండు నెలలుగా విష జ్వరాలు, ఒళ్లు నొప్పులు వెంటాడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేలాది రూపాయలు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో బాధితులు అయోమయంలో ఉన్నారు. ఈ పరిస్థితి నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామంలో రెండు నెలలుగా కొనసాగుతోంది.



మంచానికే పరిమితమైన వృద్ధుడు

● మాడ్గులపల్లి

మొదటగా కొద్దిమందికి మాత్రమే జ్వరం, ఒళ్లు నొప్పులు రాగా క్రమంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ చుట్టుకుంది. గ్రామంలో చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ఏదో ఒక రూపంలో వ్యాధి లక్షణాలు వ్యాపించి వచ్చిన రోగం ఎవరికీ చెప్పుకోలేక నానా తంటాలు పడుతున్నారు. చివరికి ఆసుపత్రికి వెళ్లి చూపించుకున్నా ఫలితం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టి పరీక్షలు చేయించుకున్నా రోగం నిర్ధారించకపోవడం మూలంగా ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ప్రతి ఇంట్లో ఇద్దరు చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. చిన్నపిల్లలకు సైతం కాళ్లనొప్పులు రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతుంటే వైద్యాధికారులు మాత్రం నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. జ్వరం వచ్చిందని వైద్య సిబ్బంది వద్దకు వెళ్తే మాత్రలతోనే సరిపెడుతున్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు రెండు నెలలుగా 125 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా ఒకటి డెంగ్యూ, నాలుగు టైఫాయిడ్ పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు గుర్తించారు. రక్త నమూనాలను సేకరించిన వైద్యులు రిపోర్టులను అందించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఇంటింటికీ జ్వరాలు విస్తృతంగా వ్యాపించడంతో వైద్యులు మాత్రం దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. గ్రామంలో ఎక్కువ మంది బాధితులు మిర్యాలగూడ, నల్లగొండ వంటి పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవడంతో నెగిటీవ్‌గా రిపోర్ట్స్ వచ్చినప్పటికీ వ్యాధి మాత్రం తగ్గడం లేదు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతుచిక్కని వ్యాధితో గ్రామస్థులు అయోమయానికి గురవుతున్నారు. కీళ్ల నొప్పులతో పాటు శరీరం నల్లగా మారడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మందులు వాడినంత వరకు వ్యాధి తగ్గినప్పటికీ ఆ తరువాత తిరిగి వ్యాపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో అప్రమత్తత అవసరం

తిప్పర్తి, మార్చి 22 : గ్రామీణ ప్రాంతాల్లో విషజ్వరాలపై అప్రమత్తత అవసరమని రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీరెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎర్రగడ్డలగూడెం గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో రెండు నెలలుగా విషజ్వరాలతో బాధపడుతున్న పలువురు రోగులను ఆయన పరిశీలించారు. అనంతరం వారి నుంచి రక్తనమూనాలు, ఇంట్లోని తాగునీటిని సేకరించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, రాజేష్‌కుమార్, వైద్యబృందం ఉన్నారు.

అంతుచిక్కని వ్యాధితో నడవలేకపోతున్నాం



నెల రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నాం. ఆరోగ్యం కుదుటపడడం లేదని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి మందులు వాడినా తగ్గడం లేదు. మొదట నా ఇద్దరు పిల్లలకు వచ్చింది. ఇప్పటివరకు రూ.25వేలు ఖర్చు చేసినా వ్యాధి తగ్గడం లేదు. నడవలేకపోతున్నాం. అయితే వ్యాధి ఏంటో తెలియడం లేదు. వైద్యాధికారులు గ్రామాన్ని సందర్శించి పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించి మందులను అందచేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

● పందిరి లక్ష్మీ, ఇందుగుల గ్రామస్థురాలు

నెల రోజులుగా అవస్థలు



ముక్కుపై మచ్చ, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న దాసరి సైదులు

గ్రామానికి చెందిన మిన్నమ్మ, దాసరి సైదులుకు నెల రోజుల క్రితం జ్వరం తగ్గిన అనంతరం కీళ్ల నొప్పులు, వాపులు మొదలయ్యాయి. శరీరంపై, ముక్కుపై నల్లటి మచ్చలు వచ్చాయి. సైదులు సుతారి మేస్త్రిగా పనిచేస్తుండగా నెల రోజుల్లో 20వేల రూపాయలు వ్యయం చేసినా ఎటువంటి మార్పు లేదు. శరీరంపై దురద వస్తుండటంతో నెల రోజులుగా పనికి వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామంలోని ఎక్కువ శాతం మంది నిర్మాణరంగంలో పనిచేస్తూ జీవిస్తుండగా, వీరందరూ నెల రోజులుగా ఇంటికే పరిమితమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో జ్వరానికి, దురద తగ్గేందుకు నాలుగు రోజులకు సరిపడా ఔషధాలు ఇచ్చినా అవి ఏమాత్రం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఇతర సమస్యలు ఉత్పన్నమై తమకు ఆర్థికంగా భారమవుతుందన్నారు. తమ గ్రామానికి పానగల్ నుంచి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారని, నీటిశుద్ధి కేంద్రాల నుంచి తీసుకువచ్చి వాడినా అందరికీ ఇదే సమస్య కనిపిస్తోందని చెబుతున్నారు. 15 రోజుల అనంతరం ముక్కు నల్ల రంగులోకి మారుతుందని, మొహంపై మచ్చలు వస్తాయని చెబుతున్నారు. ఇందుగుల గ్రామానికి మాడ్గులపల్లి గ్రామం నుంచి వచ్చిన ఓ ఎలక్ట్రీషియన్ రెండు రోజుల అనంతరం ఇదే సమస్యలతో బాధపడుతుండటంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాడు.



ముక్కుపై నల్లటి మచ్చ, కీళ్ల నొప్పులు, వాపుతో బాధపడుతున్న మిన్నమ్మ

చేరికలకు కాదు.. సాగర్ గేట్లు ఎత్తండి

● రైతులు నిలదీస్తారని మొహం చాటేసుకున్న మంత్రులు

● మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



సూరేపల్లి మేజర్ పరిధిలో ఎండిపోయిన వరిపొలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ/భూదాన్‌పోచంపల్లి, మార్చి 22: ఇతర పార్టీల నేతలను చేర్చుకునేందుకు గేట్లు ఎత్తుతున్నట్లు ప్రకటించడం కాదని... ఆయకట్టు రైతులను ఆదుకునేందుకు సాగర్ గేట్లు ఎత్తించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పలు మండలాల్లో ఆయన ఎండిన వరి పైరును పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను రోడ్లపాలు చేశారని విమర్శించారు. తెలంగాణను దోచి ఢిల్లీ నాయకత్వానికి పంపిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఎన్ని ప్రయత్నాలు చేసైనా రైతుల భూములకు నీళ్లు అందించే వారన్నారు. ఎండుతున్న పొలాల వైపు ఏ మంత్రి తొంగిచూడటం లేదన్నారు. పోలీసులను కాపలా పెట్టి పాలేరుకు నీళ్లను తరలించుకపోయినా జిల్లా మంత్రులకు సోయిలేకుండా పోయిందన్నారు. జిల్లా మంత్రుల నిర్వాకం వల్లే ఒక్క తడి పారితే పంటలు గట్టెక్కే పొలాలు సైతం ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రెండు లక్షల ఎకరాల్లో పంట కోల్పోయి కోట్ల రూపాయల నష్టం జరిగిందన్నారు. వంద రోజుల పాలనలో రాష్ట్రాన్ని కరువు కమ్ముకుందని విమర్శించారు. త్రీ ఫేజ్ కరెంట్ లేక మోటార్లు సైతం కాలిపోతున్నాయన్నారు. ఇప్పటికే సుమారు లక్ష ఎకరాల పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా ఉందన్నారు. లోవోల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులకు వేల రూపాయల నష్టాన్ని కలిగిస్తున్నాయని, ఒక్కో మోటారు రిపేరుకు సుమారు వారం రోజులు పట్టడంతో మోటార్లు బిగించేలోపే వరి పంట ఎండిపోతోందన్నారు. రైతులను ఆదుకోవడంలో జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డికి సోయిలేదని విమర్శించారు. రైతుల సమస్యలపై, రైతుబంధు అందలేదని నిలదీస్తారని భయపడిన మంత్రులు రైతులను కలువకుండా మొహం చాటేసుకుంటూ దొంగల్లా తిరుగుతున్నారని విమర్శించారు. జిల్లా మంత్రులు కల్లుతాగిన కోతుల్లా ఎగిరిపడటం తప్ప సమస్యకు పరిష్కారమార్గం చూపడం లేదని ఎద్దేవా చేశారు. మంత్రులు మిల్లర్లతో కుమ్మక్కై రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆరోపించారు. ప్రజలు తరిమికొడతారనే భయంతోనే మంత్రులు గ్రామాల్లోకి వెళ్లడం లేదన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, రమావత్ రవీంద్రకుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, యాదాద్రిభువనగిరి జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వేంకటేశ్వర్‌రెడ్డి, రాంచందర్ నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫోన్ వచ్చింది.. ఎవరిదో?

భూదాన్‌పోచంపల్లి: మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి శుక్రవారం పోచంపల్లి మండలంలోని దోతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను సందర్శించారు. అయితే ఆయన పర్యటన కోసం ముందస్తుగా మండలంలోని పరిసర గ్రామమైన ఎల్లగిరి వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు జగదీష్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ ప్రతినిధులు కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సమయంలోనే ఆయనకు ఎవరి నుంచో ఫోన్ కాల్ వచ్చింది. వెంటనే ఆయన ఫోన్‌లో సంభాషించి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెనుదిరిగారు. అయితే మాజీమంత్రి పర్యటనకు వచ్చిన పైళ్ల శేఖర్‌రెడ్డి పంట పొలాల పరిశీలన కార్యక్రమానికి హాజరు కాకుండా. జగదీష్‌రెడ్డిని కలవకుండానే ఆయన వెళ్లిపోయాడు. దీంతో అక్కడ ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు 'ఫోన్ కాల్ ' పైనే చర్చించుకున్నారు. శేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారన్న ప్రచారం నేపథ్యంలో ఆయన జగదీష్‌రెడ్డిని కలవకుండా వెళ్లడం చర్చనీయాంశమైంది.



మాజీమంత్రి జగదీష్‌రెడ్డి కార్యక్రమానికి వచ్చిన పైళ్ల శేఖర్‌రెడ్డి ఫోన్‌లో సంభాషిస్తున్న దృశ్యం

పంట ఆదాయం.. నీటి ఖర్చుకే సరి...



అవురవాణిలో ఓ బావి నుంచి నీటిని కొనుగోలు చేసి నింపుకుంటున్న ట్యాంకర్లు



ట్యాంకర్ల ద్వారా పొలానికి నీటిని పెడుతున్న రైతు

● అవురవాణిలో నీటికి గోసపడుతున్న రైతులు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అవురవాణి పరిధిలో భూగర్భ జలాలు అడుగంటి సాగునీటి కోసం రైతులు తిప్పలు పడుతున్నారు. పొట్టదశకు వచ్చిన పంటలను కాపాడుకోవటానికి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పైర్లను తడుపుతున్నారు. యాసంగి సీజన్‌లో 420 ఎకరాల్లో వరి సాగుచేశారు. వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన భూగర్భజలాలతో బోర్లు ఎండిపోయి పైర్లకు తగినంత నీరు అందడంలేదు. దీంతో చేతికందే దశకొచ్చిన వరిపైరు ఎర్రబారింది. పంటలను కాపాడుకునే ప్రయత్నంలో ఇక చేసేది లేక ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు అందిస్తున్నారు. పంట ఆదాయం ట్యాంకర్ల ఖర్చుకు సరిపోతుందని రైతులు వాపోతున్నారు. ● నార్కట్‌పల్లి

వైభవంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ



నిత్యకల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

భువనగిరి అర్బన్, మార్చి 22: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన ఆచార్యులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి, సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 16,51,136ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

మా ప్లాట్లను ఇప్పించండి



ఆర్డీవో వేణుమాధవ్ ఆక్రమించినవిగా బాధితులు చెబుతున్న ప్లాట్ల స్థలం, మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

నార్కట్‌పల్లి, మార్చి 22: తాము కొనుగోలు చేసిన ప్లాట్లను ఆక్రమించిన ప్రభుత్వ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎస్ఐ ఎస్.అంతిరెడ్డికి ఫిర్యాదుచేశారు. తమ ప్లాట్లను అక్రమంగా ఆక్రమించుకోవడమే కాకుండా అధికారిననే దర్పంతో బెదిరిస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధితులు విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామ రెవెన్యూ శివారు పరిధిలో(వారిజాల వేణుగోపాలస్వామి గుట్ట కింద) గల సర్వే 301లో ఉయ్యాల స్వామి అనే రైతుకు 12.26 ఎకరాల భూమి ఉన్నట్లు పాస్‌పుస్తకాల్లో ఉంది. కానీ సదరు సర్వే నెంబర్‌లో భౌగోళికంగా మాత్రం కేవలం 11.06 గుంటలు మాత్రమే భూమి ఉందని దీంతో అంతమేరకే నిర్ణయించిన ధర మేరకు పోలోజు విక్రమ్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేసి ఆ భూమిలో వీవీజీఎస్ పేరిట 182 ప్లాట్లతో వెంచర్ చేయగా వీటిలో తాము దాదాపు 36మంది కలిసి ప్లాట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వాదేశానుసారం తాము దాదాపు రెండేళ్ల పాటు తమ ప్లాట్ల వద్దకు వెళ్లలేకపోయామన్నారు. కరోనా లాక్‌డౌన్ ముగిసిన తర్వాత తాము వెళ్లి చూసే సరికి ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉందన్నారు. ఇలా ఎవరు చేశారని తెలుసుకుంటే విక్రమ్‌కు వెంచర్ భూమిని విక్రయించిన వ్యక్తే అల్లె శ్రీహరి అనే వ్యక్తికి 1.20 ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేశాడని ఆ భూమిని సదరు శ్రీహరి ఆర్‌డీవో వేణుమాధవ్(సతీమణి పేరిట)కి విక్రయించగా కంచె ఏర్పాటుచేశాడని ఆరోపించారు. దీంతో తమకు జరిగిన అన్యాయంపై అప్పట్లోనే చిట్యాలలో సీఐ శంకర్‌రెడ్డిని సంప్రదించగా శ్రీహరి అనే వ్యక్తి సదరు స్థలాన్ని ఆర్‌డీవో వేణుమాధవ్‌కు విక్రయించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. ఈ సమస్యను అప్పటి ఎస్పీ దృష్టికి కూడా తీసుకెళ్లగా సామరస్య వాతావరణంలో పరిష్కరించుకోవాలని సూచన చేశారని, సరేనని అంగీకరించిన వేణుమాధవ్ ఇప్పటివరకు స్పందించలేదన్నారు. తాము మానసికంగా కుంగిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో తాము సిద్ధంగా ఉన్నామని, మా ప్లాట్లను మాకు స్వాధీనపర్చి న్యాయం చేయాలని కోరుతూ ఎస్ఐకి వినతిపత్రం ఇచ్చామని చెప్పారు.

సెల్‌ఫోన్ దొంగిలించిందని హత్య

దేవరకొండ, మార్చి 22: నల్లగొండ జిల్లా దేవరకొండలో ఈ నెల 13న హత్యకు గురైన డిండి మండలం గోనకోలుకు చెందిన శ్రీలత కేసు మిస్టరీ వీడింది. హత్య వివరాలను దేవరకొండ డీఎస్పీ గిరిబాబు సీఐ నర్సింహులుతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సిద్ధనపాలెం గ్రామానికి చెందిన బొమ్మనబోయిన సాంబయ్య మిరపకాయలు ఏరేందుకు కూలీల కోసం తరచుగా దేవరకొండకు వస్తుంటాడు. జనవరి 10న సాంబయ్య దేవరకొండకు రాగా బస్టాండ్‌లో దేవరకొండకు చెందిన నర్సింహ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి స్నేహంగా మారింది. దేవరకొండకు వచ్చినప్పుడల్లా సాంబయ్య నర్సింహను కలిసి మద్యం సేవించేవాడు. వీరిద్దరికి హోటల్‌లో పనిచేస్తున్న శ్రీలతతో పరిచయం ఏర్పడింది. ముగ్గురు కలిసి మద్యం సేవించేవారు. జనవరి 28న ముగ్గురు కలిసి మద్యం సేవించి మద్యం మత్తులో పాడుపడిన బిల్డింగ్‌లో నిద్రించారు. సాంబయ్యకు, శ్రీలతకు వివాహేతర సంబంధం ఏర్పడిందని డీఎస్పీ తెలిపారు. జనవరి 29న సాంబయ్య వద్ద ఉన్న రూ.25వేల నగదు, సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో శ్రీలతపై అనుమానం వచ్చిన సాంబయ్య డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని ఆమెను నిలదీశాడు. అయినా శ్రీలత స్పందించకపోవడంతో కక్ష పెంచుకున్నాడు. ఈనెల 13న దేవరకొండకు వచ్చిన సాంబయ్య నర్సింహను, శ్రీలతను కలిసి మద్యం సేవించాడు. సెల్‌ఫోన్, డబ్బుల గురించి శ్రీలతను అడగ్గా వారి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆమెను హత్య చేయాలని సాంబయ్య నిర్ణయించుకుని అదే రోజు దేవరకొండలో ఓ దుకాణంలో కత్తిని కొనుగోలు చేశాడు. దేవరకొండలో పడావుబడిన బిల్డింగ్ వద్దకు నర్సింహ ద్వారా శ్రీలతను పిలిపించి మద్యం సేవించాక ఆగ్రహంతో ఉన్న సాంబయ్య కత్తితో శ్రీలత గొంతుకోసి చనిపోయిందని నిర్ధారించుకున్న తరువాత అక్కడి నుంచి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం సాంబయ్య దేవరకొండలో అనుమానస్పదంగా సంచరిస్తుండగా పట్టుకొని విచారించగా శ్రీలతను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. సాంబయ్యను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఎస్ఐలు సైదులు, రమేష్, నందులాల్, సిబ్బంది బాలునాయక్, తిరుపతి, రాజరాం, శంకర్, శ్రీధర్‌రెడ్డి, చంద్రమౌళి, ఏడుకొండలు, సింహాద్రి, యాదయ్యలను డీఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దవూర, మార్చి 22 : నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన అఖిల్(17), కార్తీక్‌లు సాగర్ నుంచి పెద్దవూరకు బైక్‌పై వెళ్తూ నాయనివాని కుంట స్టేజీ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా, కార్తీక్‌కు తీవ్రగాయాలయ్యాయి. కార్తీక్‌ను సాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. కాగా ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఘటనా స్థలాన్ని సాగర్ సీఐ బీసన్న పరిశీలించారు.

వేములూరి వాగులో ఇసుక దందా


హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసపురంలోని వేములూరి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక

▸▸ రాజకీయ నేతల సిండికేట్ వ్యాపారం ▸▸ రేయింబవళ్లూ అక్రమ రవాణా

హుజూర్‌నగర్ ప్రాంతంలోని వేములూరి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. రాజకీయ నేతలు సిండికేట్‌గా మారి ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నందున అడ్డుకునే సాహసాన్ని అధికారులు చేయడంలేదు. దీంతో రేయింబవళ్లూ ఇసుక అక్రమంగా తరలిపోతుంది. ఈ ఇసుక దందాపై స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

- హుజూర్‌నగర్

హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల పరిధిలో వేములూరి వాగు ఉంది. హుజూర్‌నగర్ మండలంలో 20కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఈ వాగు జీవనదిగా పేరుగాంచి 50 వేల ఎకరాలకు సాగునీరందించేంది. ఈ వాగు గత 15 ఏళ్లుగా ఎప్పుడూ ఎండిపోలేదు. ఈ ఏడాది ఎండిపోవడంతో ఇసుక తేలింది. కాసులు కురిపించే ఇసుకపై హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి, అమరవరం, శ్రీనివాసపురం గ్రామాల్లోని కొందరు బడా నేతలు కన్నేశారు. వాగులోని ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్నారు. ముఖ్యంగా హుజూర్‌నగర్ ప్రాంతంలోని కొంతమంది బడా కాంట్రాక్టర్లు అర్ధరాత్రి సమయంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాంట్రాక్టర్లు బడా నేతలను మచ్చిక చేసుకున్నందున ఇసుక అక్రమ రవాణాకు మద్దతుగా నిలుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేములూరి వాగు నుంచి ప్రతిరోజు ర్యాంప్ ద్వారా ఇసుకను నేరుగా ట్రాక్టర్లలో లోడ్ చేసి హుజూర్‌నగర్, మఠంపల్లి, గరిడేపల్లి మండలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల చొప్పున విక్రయిస్తున్నారు. అధికారులకు ప్రతినెలా రూ.70వేలు ముడుపులు చెల్లిస్తున్నామని, తమను అడ్డుకునేవారేలేరని ఇసుక అక్రమ రవాణాదారులు బహాటంగానే చెబుతున్నారని స్థానికులు తెలిపారు.

ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులులేవు

వేములూరి వాగు నుంచి ఇసుకను తరలించొద్దు. మండలంలో ఇసుక రవాణాకు ఎవరికీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదు. ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. గ్రామాల్లోని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- నాగార్జునరెడ్డి, తహసీల్దార్

జనగాం క్రాస్‌రోడ్డులో మురుగునీటితో దుర్వాసన


జనగాం క్రాస్‌రోడ్డులో నిల్వ ఉన్న మురుగునీరు

గుంతను పూడ్చేస్తాం

మా దృష్టిలో ఈ గుంత ఉంది. పాత ఇళ్లను కూలగొట్టిన మట్టిని తోలి గుంతను పూడ్చేస్తాం. మురుగునీరు గుంతలోకి పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హోటళ్ల యజమానులకు ఆదేశాలు జారీ చేస్తాం.

- శ్రీనివాసరావు, కమిషనర్, సూర్యాపేట మునిసిపాలిటీ

భానుపురి, మార్చి 22: పట్టణంలోని జనగాం క్రాస్‌రోడులో పెద్ద గుంత ఏర్పడి మురుగునీరు నిల్వ ఉంటోంది. నీరు పచ్చగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. పురపాలక సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మురుగునీటి దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు ఇక్కడికి కొట్టుకురావడంతో పాటు హోటళ్ల నుంచి వచ్చిన మురుగునీరు నిలిచింది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండి పెద్ద గుంతగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. సమీపంలో మద్యం దుకాణం ఉన్నందున ప్లాస్టిక్ కవర్లు, మద్యం సీసాలు ఈ గుంతలో వేస్తు న్నారు. 29, 10, 13 వార్డుల మధ్యలో జనగ్రాం క్రాస్ రోడ్డు ఉన్నం దున ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు.

ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారడంతో ఈ మురుగునీటిలో పందులు, ఇతర జంతువులు పొర్లాడుతున్నాయని, పురపాలక సిబ్బంది ఆయిల్ బాల్స్‌ను వేయనందున దోమల ఉధృతి పెరిగిందని, పిచ్చిమొక్కలు పెరిగి గుంత బావిలా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

హుజూర్‌నగర్, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఎస్‌ఐ బలరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన కోనుగంటి నర్సిరెడ్డి(52) మఠంపల్లిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు శుక్రవారం రాత్రి ఆయన బైక్‌పై విధులకు వెళుతుండగా హుజూర్‌నగర్‌లోని మగ్దూంనగర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిని నర్సిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురు సారా విక్రేతలపై కేసు

హుజూర్‌నగర్, మార్చి 22: పాలకవీడు మండలం శూన్యంపాడుతండా, జాన్‌పహాడ్, కల్మెటతండాలో శుక్రవారం తనిఖీలు నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేశామని, వీరిలో ముగ్గురిపై కేసు నమోదు చేశామని, ఒకరిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితుల నుంచి 50 లీటర్ల సారా, 840 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ నాగార్జునరెడ్డి, శంకర్, మల్లయ్య, జగన్మోహన్‌రెడ్డి, దివ్య, వెన్నెల, గోవర్ధన్, రామకృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్లు చోరీ

మఠంపల్లి, మార్చి 22: మండలంలోని చెన్నాయిపాలెంలో గురువారం రాత్రి వ్యవసాయ మోటర్లను దొంగలు చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులుబానోతు బాలు, బోమ్మనబోయిన కోటేశ్వరావు, బానోతు రవి వ్యవసాయ పొలాల్లో ఉన్న మోటార్లు, స్టాటర్ బాక్కులు, రాగి తీగలు చోరీ అయ్యాయి. చోరీ అయిన పరికరాల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు

కోదాడ, మార్చి 22: ఇసుక రవాణా చేస్తూ ఘర్షణ పడిన రెండు వర్గాలకు చెందిన ఏడుగురిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రాము తెలిపారు. పట్టణానికి చెందిన వీరారెడ్డి, జబ్బార్, త్రివిల్, ఉదయ్‌తో పాటు మరో ముగ్గురు రెండు వర్గాలుగా ఏర్పడి ఇసుక వ్యాపారం చేస్తూ విబేదాలతో ఘర్షణ పడినట్లు తెలిపారు. పరస్పరం ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేసి రెండు ఇసుక డంపులను సీజ్ చేశామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దిరాల, మార్చి 22: మండలంలోని పోలుమల్ల గ్రామానికి చెందిన ఆమంచి సత్తయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం. 21క్వింటాళ్ల బియ్యాన్ని సత్యయ్య ఇంటి నుంచి స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'మా వైద్యుడు మాకే కావాలి'

సూర్యాపేట సిటీ, మార్చి 22: నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న సూర్యాపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డిని ఆసిఫాబాద్‌కు బదిలీ చేయడం రాజకీయ కక్ష సాధింపేనని, ఆయనను సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి బదిలీ చేయాలని సూర్యాపేటవాసులు డిమాండ్ చేశారు. డాక్టర్ మురళీధర్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఆందోళన చేశారు. సూర్యాపేట మెడికల్ కళాశాలకు భూముల సేకరణలో మురళీధర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని, ఆయన లేకుండా మెడికల్ కళాశాల పూర్తియ్యేదికాదని అన్నారు. అనంతరం మా ప్రాంత డాక్టర్ మాకే కావాలంటూ నినాదాలు చేస్తూ జనరల్ ఆసుపత్రి నుంచి జనగాం క్రాస్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పటేల్ రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గెల్లిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెన్న శశిధర్‌రెడ్డి, శ్రీధర్, వేముల అంజి పాల్గొన్నారు.

హరితహారం మొక్కలను సంరక్షించాలి

పెన్‌పహాడ్, చివ్వెంల, మార్చి 22: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామంలో హరితహారం గ్రామంలో నాటిన మొక్కలను ఆయన పరిశీంచారు. చివ్వెంల మండల బండమీదిచందుపట్ల గ్రామంలో పంచాయతీ రికార్డులను పరిశీలించి మాట్లాడారు.

'గొర్రెల కాపరికి పరిహారం చెల్లించాలి'

తిరుమలగిరి, మార్చి 22: మండలం వెలిశాల గ్రామంలో ఇటీవల కుక్కల దాడిలో ఎల్లంల సమ్మయ్యకు చెందిన 35గొర్రెలు మృతి చెందాయని, ఆయనకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుధకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కడారి లింగయ్య, సమ్మయ్య, సతీష్ పాల్గొన్నారు.

అశోక్‌నంద భారతిస్వామికి డాక్టరేట్

తిరుమలగిరి, మార్చి 22: తిరుమలగిరికి చెందిన శ్రీశైలం ఆశ్రమ పీఠాధిపతి అశోక్‌నందభారతి స్వామి వెబ్బిక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. జ్యోతిష శాస్త్రంలో ఆస్ట్రాలజీ, చేతిరేఖలపై చేసిన పరిశోధనలకు హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు డాక్టరేట్ అందజేశారు.

ప్రతి నీటిబొట్టును కాపాడాలి: తహసీల్దార్


నూతన్‌కల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నూతన్‌కల్, మార్చి 22: ప్రతి నీటి బొట్టు వృథా కాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలసి సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. చింతకుంట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చల్లా ప్రభాకర్‌రెడ్డి, రామస్వామి, సూర్యనారాయణరెడ్డి, సైదులు, నాగార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేశారు. ఇంకుడు గుంతలతో నీరు వృథా కాదని ఎంపీడీవో ఇమాం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమమాలిని, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన్‌కల్: ఎండలు పెరుగుతున్నందున దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యువజన కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కాస శంకర్‌యాదవ్ అన్నారు. మండలంలోని లింగంపల్లి క్రాస్ రోడ్డులో తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తొన్కునూరి రమేష్, పర్వతపు హరీష్, మచ్చ మల్లేష్ పాల్గొన్నారు.

చివ్వెంల: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తహసీల్దార్, కృష్ణయ్య, ఎంపీడీవో సతీష్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సామూహిక ఇంకుడు గుంతను పరిశీలించి మాట్లాడారు. అనంతరం జలాన్ని కాపాడుతామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీవో గోపి, ఏపీవో నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



తుంగతుర్తి, మార్చి 22: తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షు డిగా మండల కేంద్రానికి చెందిన న్యాయవాది తాళ్లపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 20న నిర్వహించిన న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా పూల్‌సింగ్‌నాయక్, జనరల్ సెక్రటరీగా ఎండీ పర్వీన్, జాయింట్ సెక్రటరీగా మల్లెపాక రవికుమార్, కోశాధికారిగా బి.ప్రతాప్‌ను ఎన్నుకున్నారు.

రామిరెడ్డికి ఆత్మీయ సన్మానం

హుజూర్‌నగర్, మార్చి 22: హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సాముల రామిరెడ్డిని శుక్రవారం హుజూర్ నగర్‌లో మునిసిపల్ పాలకవర్గ సభ్యులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని, అణగారిన వర్గాలకు న్యాయ సహాయం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు కుంట ఉపేంద్ర, ఒరుగంటి నాగేశ్వరరావు, కారింగుల విజయవెంకటేశ్వర్లు, గంగరాజు, వీరారెడ్డి, చందు, నాగరాజు, దళపతి, సంపత్, చారి, నరేష్, రాజానాయక్ పాల్గొన్నారు

'ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'

సూర్యాపేట సిటీ, మార్చి 22: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పైర్లు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని, ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించాలి, జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎంపీ ఆర్థికసాయం

తిరుమలగిరి రూరల్, మార్చి 22: మండలంలోని గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్(41) ఆదివారం తాటిచెట్టు పై నుండి పడి మృతి చెందాడు. వెంన్నగౌడ్ కుటుంబ సభ్యులను భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ రూ.15వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పాలకుర్తి వీరయ్య, పెద్దగౌడ్ వెంకన్న పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

చిలుకూరు, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ మండలం అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవాంర మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి ప్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. పాలాభిషేకం చేశారు.

● కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసినవారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు ఈ సందర్భంగా పలువురు ఆరోపించారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డిపై పలువురు నాయకులు వాదనకు దిగారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పిండ్రాతి హనుమంతరావు, ఎంపీపీ ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ శిరీష పాల్గొన్నారు.

రూ.50వేలకు మించి ఉంటే ఆధారాలు చూపాలి

పాలకవీడు, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. శుక్రవారం పాలకవీడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి మూసీ నది సమీపంలో, మఠంపల్లి మండలంలోని మట్టపల్లి వంతెన సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.20లక్షల విలువైన దుస్తులు, రూ.2లక్షలను పట్టుకున్నట్లు తెలిపారు. వరి కోతల సీజన్ కొనసాగుతున్నందున రైతులు ధాన్యం విక్రయించగా వచ్చిన నగదుకు రసీదులు చూపాలన్నారు.

లక్ష్మీనృసింహుని కల్యాణం రేపు

నడిగూడెం, మార్చి 22: నడిగూడెం, మునగాల మండలాల పరిధిలోని రామాపురంలో ఉన్న పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కల్యాణాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు వారనాసి బుజ్జిరామయశాస్త్రి తెలిపారు. కల్యాణ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

25న తిరుపతమ్మ కల్యాణోత్సవం

నేరేడుచర్ల, మార్చి 22: నేరేడుచర్ల మండలం దాచారం గ్రామంలో ఈనెల 25న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని. ఆలయ పూజారి హరి సురేష్‌శర్మ, వేద పండితుడు కొంకపాక రాధాకృష్ణమూర్తి తెలిపారు. 26న ఉదయం బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలి

హుజూర్‌నగర్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆవుల హరికృష్ణకు నియామక పత్రాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజ లకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సకల జనులకు సంక్షేమం అందిస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేత కుక్కుడు మహేష్‌గౌడ్‌పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: ఎమ్మెల్యే

నాగారం, మార్చి 22: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని ఫణిగిరి గ్రామానికి చెందిన బొబ్బలి మానుష కళ్ల ఆపరేషన్‌కు రూ.2లక్షల ఎల్‌వోసీని శుక్రవారం హైదరా బాద్‌లో ఎమ్మెల్యే నివాసంలో ఆమె తల్లిదండ్రులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు పానుగంటి నర్సింహారెడ్డి, కాంగ్రెసు గ్రామశాఖ అధ్యక్షుడు రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి వల్లాల భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను సన్మానించిన వీరయ్య

గరిడేపల్లి, మార్చి 22: దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన మండలంలోని కట్టవారిగూడెం గ్రామానికి చెందిన ముత్తినేని వీరయ్య గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తన ఎంపిక చేసినందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రీతమ్‌ను కలిసిన నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, నాగారం, మార్చి 22: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన ప్రీతమ్‌ను శుక్రవారం హైద్రాబాద్‌లోని గాంధీ భవన్‌లో హుజూర్‌నగర్ పట్టణం, నాగారం మండలానికి చెందిన దళిత సంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కస్తాల సైదులు, దగ్గుపాటి బాబూరావు, ముస్తఫా, రవీందర్, మఠంపల్లి నాయకులు పానుగంటి నర్సింహారెడ్డి, కె.రాంరెడ్డి, వల్లాల భానుప్రకాష్, బొడ్డు నాగరాజు, రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


సూర్యాపేటరూరల్, మార్చి 22: సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని పరిధిలోని పిల్లలమర్రి శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ రాజబాబురెడ్డి తెలిపారు. రెండు రోజులుగా మరికంటి వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామంలో రాత్రి వేళ తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్త హరిప్రసాద్‌రావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు,

నృసింహుని హుండీ ఆదాయం రూ.7.83లక్షలు

మఠంపల్లి, మార్చి 22: మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాయలంలో శుక్రవారం హుండీని లెక్కించగా రూ.7.83 లక్షల ఆదాయం వచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ ఎస్.నిఖిల్, ఆలయ ఈవో సిరికొండ నవీన్ తెలిపారు. 69 రోజులకు భక్తుల విరాళాల ద్వారా రూ.7.33లక్షలు, నిత్యాన్నదానం పథకానికి రూ.50వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్ కుమార్ శ్రీసాయి సేవా సమితి సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

దండు మైసమ్మ ఆలయానికి రూ.4.54లక్షలు

ఆత్మకూర్(ఎస్), మార్చి 22: మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ హుండీలో నగదు శుక్రవారం లెక్కించగా రూ.4.54లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో కుషలయ్య తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి ఆలయ సిబ్బంది నాగేశ్వర్‌రావు, సైదులు, నగేష్, శ్రీనివాస్, స్టాలిన్, సతీష్, కిరణ్, రమేష్ పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: ప్రథమ ఆంధ్ర పాలకుడు, శక పురుషుడు శాలివాహన చక్రవర్తి జయంతిని పెన్‌పహాడ్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి కుమ్మర్ల సంఘం జిల్లా కన్వీనర్ నీలకంఠం, జయరామకృష్ణ, రవీందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీను, మహేష్, మధు, వేదవతి పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో షీటీమ్స్, పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, భద్రత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్‌ఐ సలిగంటి నరేష్ షీటీమ్స్ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, భార్గవి పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీ నృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలమ దర్మకర్తలు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

కోదాడ: బహుళ పరిజ్ఞానంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ గాంధీ, సీహెచ్ నాగార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: తలసేమియా వ్యాధికి మందు లేదని, నివారణ చర్యలు తీసుకోవచ్చని కోదాడ పట్టణానికి చెందిన వైద్యుడు డాక్టర్ సుబ్బారావు అన్నారు. స్థానిక అనురాగ్ కళాశాలలో తలసేమియా. సికిల్‌సెల్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా అవగాహన సదస్సు, తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. వంద మంది విద్యార్థులు రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా 100మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీఎస్ సురేష్‌కుమార్, డాక్టర్ చిన్నఈశ్వరయ్య, టీఆర్‌వో విద్యాసాగర్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ ఉమాశ్రీనివాస్‌రెడ్డి, గునుగుల గోపాల్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: ఏరియా ఫీడర్ల మరమ్మతు కారణంగా మండలంలోని దోరకుంట ఇండస్ట్రియల్ ఏరియా, తమ్మర గ్రామాలకు శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

చిలుకూరు: మండలంలో తాగనీటి ఎద్దడి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి రూపేందర్‌సింగ్, ఎంపీడీవో గిరిబాబు ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో కొత్తగా వేసిన మంచి నీటి బోరును పరిశీలించి మాట్లాడారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి షర్ఫుద్దీన్ ఉన్నారు.

● చిలుకూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి రూపేందర్‌సింగ్ ప్రారంభించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు.

నడిగూడెం: విద్యార్థులు ఇష్టమైన సబ్జెను ఎంచుకుని విద్యలో రాణించాలని ఎంఎస్ విద్యాసంస్థల సీఈవో ఎస్.శ్రీనివాసరావు అన్నారు. నడిగూడెం గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కేరీర్ గైడెన్స్‌పై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నడిగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు వై.వీరాంజనేయులు కోరారు. మండలంలోని రామాపురంలో ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో చిన్నకోటిరెడ్డి, పుల్లారెడ్డి నర్సిరెడ్డి, సైదయ్య, పాల్గొన్నారు.

● నడిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ యాతాకుల జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఇమాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హజరుకావాలని ఆయన కోరారు.

● లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నడిగూడెంమండలంలోని సమస్యాత్మక గ్రామాలైన సిరిపురం, వేణుగోపాలపురం, నడిగూడెంలో సీఐఎస్‌ఎఫ్ బృందాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. కవాతులో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలో నీటి ఎద్దడి రాకుండా చూస్తామని ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చిననెమిల గ్రామంలో ప్రభుత్వ బోర్లను పరిశీలించి మాట్లాడారు. రెడ్డిగూడెం గ్రామంలో మంచినీటి పైపులైన్ల లీకేజీలను తహసీల్దార్ అమీన్‌సింగ్ పరిశీలించి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీకాంత్, ఏఈ అఖిల్, ఉద్యావవన అధికారి స్రవంతి, అధికారులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: తిరుమలగిరి మిని ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ డ్రైవర్స్ యూనియన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గద్దల రామచంద్రు, ప్రధాన కార్యదర్శిగా కార్యదర్శి బోండ్ల జగన్, కోశాధికారిగా జేరిపోతుల ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా గోపాల్‌దాస్ రంజిత్, ఉపాధ్యక్షులుగా గంట రవీందర్, వేముల వెంకన్న, శ్రీనివాస్, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్, ఉపేందర్ ఎర్ర సైదులు పాల్గొన్నారు.

●ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమ్ ఆద్మీ పార్టి జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళీధర్‌రెడ్డి తెలిపారు. తిరుమలగిరిలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో దుంపల పారిజాత, చల్ల సాలయ్య, సోమలక్ష్మి, యాకూబ్‌రెడ్డి, నరసింహ, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● పీఎం విశ్వకర్మ పథకంతో కులవృత్తుదారులకు చేయూత లభిస్తుందని తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. తిరుమలగిరిలో పథకం లబ్ధిదారులకు పత్రాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హన్మంతు పాల్గొన్నారు.

అర్వపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్వపల్లి తహసీల్దార్ జె.శ్రీనివాసులు, ఎస్‌ఐ యాకుబ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుకను అక్రమంగా తరలించేవారిని ప్రోత్సహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక వాహనాల యజమానులు, డ్రైవర్లపై మైనింగ్ కేసులు పెడుతామన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులచే ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గరిడేపల్లి, నాగారం, మఠంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ చేయాలని సీపీఎం గరిడేపల్లి, నాగారం మండల కార్యదర్శులు షేక్ యాకుబ్, కడియం కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కీతవారిగూడెంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో యాకుబ్, నాగారంలో కుమార్, మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వ్యకా.స సమావేశంలో భూక్య పాండునాయక్ మాట్లాడారు. పైర్లు ఎండిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాంసైదులు, వెంకన్న, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

మఠంపల్లి, తుంగతుర్తి: పశువుల గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మఠంపల్లి, తుంగతుర్తి మండలాల పశు వైద్యాధికారులు శంకర్ కట్టా, ఏ.నరేష్ కోరారు. మఠంపల్లి మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని శంకర్, తుంగతుర్తి మండలంలోని కరివిరాలలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని నరేష్ ప్రారంభించి మాట్లాడారు.